క్లుప్తంగా

బీఆర్ఎస్ రజతోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదం



ఆత్మకూరు: బీఆర్ఎస్ రజతోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదమని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దోచుకోవడమే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. కాంగ్రెస్ సీఎం రేవంత్ ప్రజాపాలనను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ సభలు పెడుతోందన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, కార్యదర్శి గుండెబోయిన శ్యామ్, యూత్ నాయకులు మార్త కేదారి, రాసమల్ల రామకృష్ణ, వడ్డెపెల్లి వేణు, రమేష్, శ్రీశైలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

చేయూత



పరకాల: మున్సిపాలిటీలోని 9వ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన గుమాలాపురం సారయ్య కుటుంబానికి మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి శనివారం ఆర్థికసాయంతో పాటు 50 కి లోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆయన వెంట వార్డు నాయకులు మార్త భిక్షపతి, నారాయణదాసు, వెంకన్న, లక్ష్మీ, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, సీత ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం



దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలకేంద్రానికి చెందిన దుస్స రత్నమాల, పసరగొండకు చెందిన చేరాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాళీప్రసాదరావు శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు పొడాల మధుకర్, వేల్పుల సుధాకర్, రమేష్, శ్రీను, గువ్వ సాంబయ్య, రమణారెడ్డి, సమ్మక్కొమురు, రాజయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

అవని కళాశాలలను సీజ్ చేయాలి

హన్మకొండ: ప్రభుత్వ అనుమతులు లేని అవని జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. హనుమకొండ భీమారంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో కళాశాలలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు స్వీకరిస్తున్నారని శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా, ఎలాంటి అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పా టు చేసి బ్రోచర్లు పంచుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్న కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు.

ప్రభుత్వ నిర్ణయంపై ఫార్మసిస్టుల హర్షం

ఎంజీఎం: రాష్ట్రంలో ప్రభుత్వ ఫార్మసిస్ట్ గ్రేడ్-2లను ఇక నుంచి ఫార్మసీ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్ గ్రేడ్-1లను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్లను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా మార్పు చేస్తూ రాష్ట్ర హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ జీఓ నంబర్ 71 ఉత్తర్వులను జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ, హెల్త్ సెక్రటరీ, హెల్త్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి

కాజీపేట: ప్రతీ ద్విచక్ర వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ నాగబాబు సూచించారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశం మేరకు తనిఖీలు నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని వాహన యజమానులపై కేసు నమోదు చేసి సదరు వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను కాజీపేట చౌరస్తాలో శనివారం స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఇ-చలాన్ ద్వారా జరిమానా విధించినట్లు వివరించారు.

బిల్లులు రాక నిలిచిన పనులు

- అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణాలు
- చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే ఆపేసిన కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



షోడాషపల్లిలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణం

వేలేరు : ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించడానికి, పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 సంవత్సరంలో చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. మండలంలోని 9 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్, విద్యుత్ సదుపాయాలు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించి పనులకు అనుమతులు ఇచ్చారు. ఇందులో భాగంగా షోడాషపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో రూ.27 లక్షలతో అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 80 శాతం వరకు పనులను పూర్తి చేసి బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశాడు. వేలేరు ప్రాథమిక పాఠశాలలో చిన్న మరమ్మతుల కోసం రూ.9 లక్షలు కేటాయించగా దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. చేసిన పనులకు కేవలం రూ. 3 లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయని, మిగతా బిలుల్లు రావడం లేదని సంబంధిత కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరు జెడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేయడానికి వీలుగా డైనింగ్ హాల్, వంట గది నిర్మాణానికి రూ.14.50 లక్షలతో పనులు చేపట్టగా సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్లు పోసి, సగం వరకు గోడలు కట్టి బిల్లులు రావడం ఆలస్యమవుతుందని పనులు మధ్యలోనే వదిలేశారు. దీంతో మధ్యాహ్న భోజన సిబ్బంది ఆరుబయటనే వంట వండుతున్నారు. విద్యార్థులు పాఠశాల వరండాలో కూర్చునే భోజనం చేస్తున్నారు. అలాగే పీచర ప్రాథమిక పాఠశాలలో పనులకు రూ.8 లక్షలు కేటాయించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సుమారు రూ.4 లక్షల వరకు పనులు పూర్తి చేశాడు. రూ.4 లక్షల పనులకు కేవలం రూ.1 లక్ష బిల్లు మాత్రమే వచ్చిందని మిగతా రూ.3 లక్షల బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎక్కడికక్కడే నిలిచిన పనులు

మన ఊరు-మన బడి పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో పనులు మొత్తం అసంపూర్తిగానే ఉన్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లుఉల సరైన సమయంలో రాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. పాఠశాలల్లో చేపట్టిన పనులకు ఇప్పటికే లక్షలాది రూపాయలు అప్పులు తీసుకువచ్చి చేశామని, చేసిన పనులకైనా బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పిస్తుండడంతో మన ఊరు మన బడి పాఠశాలలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తాము చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని కాంట్రాక్టర్లు అధికారులను వేడుకుంటున్నారు.

అప్పులు తెచ్చి పనులు చేశాం..



మండలంలోని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.8 లక్షలతో మైనర్ రిపేర్ పనులను చేపట్టాను. రూ.4 లక్షల పని పూర్తి చేశాను. ఇప్పటికీ రూ.1 లక్ష మాత్రమే బిల్లు వచ్చింది. ఇంకా రూ.3 లక్షల బిల్లులు రావాలి. మిగతా రూ.4 లక్షలు పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. అధికారులు ఒత్తిడి తేవడంతో అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి పనులు చేశాను. బిల్లులు ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. – పిట్టల సతీష్, కాంట్రాక్టర్

దోచుకున్న సొమ్ముతోనే బహిరంగ సభ

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనాన్ని దోచుకున్న సొమ్ముతోనే నేడు రూ. 1200 కోట్లతో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. తన 32 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇంతటి దుర్మార్గపు..నీచ రాజకీయాలు ఏనాడు చూడలేదని మాజీ సీఎం కేసీఆర్‌పై మండిపడ్డారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ పార్టీ డబ్బు ఖర్చు చేయడానికి భయపడుతుంటే ..బీఆర్ఎస్ వందల కోట్లు ఖర్చు చేసి 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ప్రజలను మరోసారి మాయమాటలతో మోసం చేయడం కోసమే బహిరంగ సభను తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ పని తీరుకు 75 శాతం అనుకూలం, కాంగ్రెస్‌కు 25 శాతం రావడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సర్వే నిజమైతే కేసీఆర్ తన 39 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి మళ్లీ గెలువాలని సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విదేశాల నుంచి రూ.40వేల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తే ఏడాది పాలనలో కాంగ్రెస్‌రూ.1లక్షా72 వేల కోట్ల పెట్టుబడులు తీసుకరావడం జరిగిన విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని కుట్రపూరితంగా బీఆర్ఎస్ అడ్డుకోవడం జరుగుతుందని అన్నారు. అందుకు నిదర్శనం చెరువుల పునరుద్ధరణకు హైడ్రా కార్యకలాపాలు అడ్డుకోవడంతో పాటు హైదరాబాద్ కంచె భూములను స్వాధీనం చేసుకునే ప్రక్రియను అడ్డుకోవడం జరుగుతుందన్నారు. కేసీఆర్ సర్కార్ అవినీతి దాహానికి లక్షల కోట్లతో నిర్మాణం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు నిరుపయోగంగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాడి కల్పనాదేవి, మాజీ కౌన్సిలర్స్ మడికొండ సంపత్‌కుమార్, పొరండ్ల సంతోష్, మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



వేలేరు : జెండావిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

వేలేరు : ఎల్కతుర్తిలో నేడు (ఆదివారం) నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గుండ్లసాగర్‌లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మండలానికి చేసిందేమి లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మండలానికి సాగునీరు, డబుల్ రోడ్లు, అన్ని గ్రామాలకు లింక్ రోడ్లు తీసుకువచ్చామని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారలేదని, కేవలం తన బిడ్డ రాజకీయ భవిష్యత్ కోసమే పార్టీ మారాడని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి, మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, నాయకులు దేవేందర్ రెడ్డి,జానీ, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఐనవోలు : మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్‌రావు

ఐనవోలు: ఎల్కతుర్తిలో రజతోత్సవ భారీ బహిరంగసభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపల్లి చందర్‌రావు, కన్వీనర్ తంపుల మోహన్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ ఆవిర్భవించిందన్నారు. సమావేశంలో ఉస్మాన్ అలీ, పల్లకొండ సురేష్, కావటి స్వామి, బరిగెల సదానందం, కంజర్ల రమేష్, తీగల లక్ష్మణ్, దేవదాస్, ఎల్లగౌడ్, అశోక్, కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూపాలపల్లిలో మెగా జాబ్‌మేళా



సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలోని పుష్ప గార్డెన్స్‌లో నేడు (ఆదివారం) ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పలువురు ఎమ్మెల్యేలు రానున్నట్లు తెలిపారు. మండలంలోని 24 గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని ఉద్యోగాలను పొందాలని తెలిపారు. జాబ్ మేళాకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోలేని వారి కోసం ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిందం రవి, మారెపల్లి కట్టయ్య, వరదరాజు, రాజేందర్, రాము, ప్రపంచరెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూలో వేసవి సెలవులు రద్దు చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు మే 1వ తేదీ నుంచి ఇవ్వబోతున్న వేసవి సెలవులను రద్దు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవుల పేరుతో హాస్టళ్లు, మెస్‌లను మూసివేయాలని నిర్ణయించడం సరి కాదన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న క్రమంలో వేసవి సెలవులు రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు మాతంగి వినయ్, మధు, మేకల పీటర్, భరత్, పోతరాజు ఉదయ్, రాజేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అంధ బాలికకు పింఛన్ ఇప్పించాలి



పింఛన్ కోసం కలెక్టర్‌ను వేడుకుంటున్న బాలిక తల్లి లావణ్య

దామెర : అంధబాలికకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను వేడుకున్న ఘటన మండలకేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు కలెక్టర్ ప్రావీణ్య అక్కడికి చేరుకున్నారు. సమావేశం ముగిసిన అనంతరం వెళ్లిపోయే క్రమంలో మండలకేంద్రానికి చెందిన మేరుగు భావన్య (6) పుట్టుకతో అంధత్వం కలిగి ఉంది. కాగా భావన్య తల్లి లావణ్యతో కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా తల్లి మాట్లాడుతూ పుట్టుకతోనే వంద శాతం అంధత్వంతో జన్మించిందని అన్నారు. పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంఇ. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పింఛన్ మంజూరయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి అందించడమే లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులతో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ డివిజన్లలో అర్హులైన పేదలను గుర్తించాలని సూచించారు. తొలిదశలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. తొలుత పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్, విజయశ్రీ, మామిండ్ల రాజు, పోతుల శ్రీమన్నారాయణ, మానస, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, మాధవిరెడ్డి, నాయకులు అంకూస్, రహీమున్నీసా బేగం, సంపత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్‌పై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

హసన్‌పర్తి: అనుమతి లేకుండా ఎలక్ట్రానిక్ కాంటా నిర్వహిస్తున్నందుకు ధాన్యం కొనుగోలు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నట్లు తూనికలు కొలతల జిల్లా అధికారి శ్రీలత తెలిపారు. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్ జరిగిన ఘటనపై శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తూకం వేసిన ఎలక్ట్రానిక్ కాంటాను ఆమె పరిశీలించారు. ఎలక్ట్రానిక్ కాంటాలో సాంకేతిక సమస్య కారణంగా హెచ్చుతగ్గులు వస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఎలక్ట్రానిక్ కాంటా నిర్వహణకు సర్టిఫికెట్ అవసమన్నారు. 2024-25వ సంవత్సరానికి కాంటా నిర్వహణకు సర్టిఫికెట్ పొందలేదని తెలిపారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదని చెప్పారు. ప్రస్తుతం కాంటా సక్రమంగా పనిచేయడం లేదని, దాంతో కాంటాను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులకు జరిమానా విధించనున్నట్లు శ్రీలత వెల్లడించారు.

క్రైం కార్నర్

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్



ధర్మసాగర్ : దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జానీ పాషా తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజీపేట మండలం రాంపూర్‌లో గజ్జలబండ ప్రాంతంలో నివసిస్తున్న బానోతు శంకర్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువా పగలగొట్టి అందులోని బంగారం, వెండి వస్తువులు చోరీ చేసినట్లు ఇటీవల ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండు రోజుల్లోనే అట్టి చోరీ కేసులో ఇద్దరి వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. హనుమకొండలోని యాదవనగర్‌కు చెందిన ధరావత్ గణేష్, కడిపికొండలోని ఇంది రమ్మ క్వార్టర్‌లో ఉంటున్న బానోతు విజయ్‌లను అరెస్ట్ చేసి విచారించగా విలాసవంతమైన జీవి తానికి అలవాటు పడి తమ ద్విచక్ర వాహనానికి టీఆర్ నంబర్ పెట్టుకొని ఒంటరిగా ఉన్న ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీరిపై గతంలో కేయూ, సుబేదారి, మడికొండ పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనం కేసులు నమోదైనట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఫోన్ దొంగిలించిన గుర్తుతెలియని వ్యక్తులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన వలగుల సంతోష్‌బాబుకు చెందిన మొబైల్ సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఎస్సై జక్కుల పరమేష్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం గట్లకానిపర్తికి చెందిన సంతోష్‌బాబు అదే గ్రామంలో ఓ వివాహానికి హాజరయ్యాడు. సంతోష్‌బాబు తన మొబైల్ ఫోన్‌ను తన బైకు పౌచ్‌లో పెట్టి శుభకార్యంలో అన్నం వడ్డించి పూర్తయ్యాక వెళ్లి బండి పౌచ్‌లో చూడగా ఫోన్ కనబడలేదు. దీంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌ను దొంగిలించారని గమనించిన సంతోష్‌బాబు తన బ్యాంకు అకౌంట్ బ్యాలెన్స్ చూసుకోగా ఫోన్‌పే ద్వారా తన అకౌంట్‌లోని రూ. 19,420 కాజేసినట్లు ఉంది. దీంతో సంతోష్‌బాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్‌వైరు చోరీ.. నిందితుల అరెస్ట్




ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టులోని చల్లా ఇన్‌ఫ్రా ప్లాంటులో 22 కిలోల కాపర్ వైరు చోరీ కాగా ఈనెల 23న ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం నిందితులు దొరకగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం పెద్దాపూర్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ఆటోను తనిఖీ చేయగా అందులో ఇనుప వస్తువులు లభ్యమయ్యాయి. ఆటోలో ముగ్గురు ఉండగా ఒక యువతి పరారైంది. ఆటోలో ఉన్న నిందితులు ములుగు జిల్లా ఇంచర్లకు చెందిన వనం కవిత, వరంగల్ జిల్లా చింతల్‌కు చెందిన ఇసంపెల్లి రాహుల్‌ను విచారించగా కాపర్‌వైరును వరంగల్‌లో అమ్మినట్లు తెలిపారు. ఇనుప వస్తువులను టెక్స్‌టైల్ పార్కు సమీపంలో దొంగతనం చేసి ములుగులో అమ్మడానికి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1లక్ష50వేలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇంకా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని వారిని వెతుకుతున్నామని సీఐ సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బొత్త సదయ్య (55) పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై జక్కుల పరమేష్ కథనం ప్రకారం..గోవిందాపూర్‌కు చెందిన సదయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. సదయ్య పంట పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. తన భూమిలో వేసిన పంట సరిగా పండకపోవడంతో పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందిన సదయ్య శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనంలో సదయ్యను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య వనక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి నీరుకుళ్ల క్రాస్ రోడ్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్‌కు చెందిన సాలూరి రాజేష్, శంకర్‌రావు, నితిన్ బైక్‌పై హనుమకొండ నుంచి ములుగువైపు వెళ్తుండగా నీరుకుళ్ళ క్రాస్ రోడ్ సమీపంలో బైక్ అదుపు తప్పి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజేష్, నితిన్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను 108 సిబ్బంది ఈఎంటీ నరేశ్, పైలట్ రాజు చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు.

30న 'భద్రకాళి'లో ముదిరాజ్‌ల సేవ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులసంఘం ప్రతినిధులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరగనున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 30న ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేవాలయం ఆవరణలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు పల్లెబోయిన అశోక్‌కుమార్, వరంగల్ మహానగర అధ్యక్షుడు బయ్య స్వామి అధ్యక్షతన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. సేవా కార్యక్రమాల్లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.